పశువులకు అందని వైద్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలనూ నిర్వీర్యం చేస్తోంది. ముఖ్యంగా ప్రజలతోపాటు పశువుల వైద్యంపైనా చిన్నచూపు చూస్తోంది. పశువైద్యశాలల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఏహెచ్‌ఏలు డాక్టర్ల పాత్ర పోషిస్తూ పశువులకు చికిత్స చేస్తున్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన సంచార పశువైద్య వాహనాన్ని తొలగించింది. దీంతో సకాలంలో వైద్యం అందక పశువులు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

- పశువైద్యులు, సిబ్బంది కొరత
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పశు వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న రైతులు


డీవీ సత్రంలోని తీరగ్రామాల్లో దూడలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏహెచ్‌ఏలు (ఫైల్)

దొరవారిసత్రం : మండలంలో దొరవారిసత్రం, మావిళ్లపాడు గ్రామాల్లో పశువైద్య ఆస్పత్రులు, మారుమూల ప్రాంతమైన శ్రీధనమల్లిలో పశువైద్య సబ్ సెంటర్ ఉన్నాయి. డీవీ సత్రంలోని పశువైద్య ఆస్పత్రిలో డాక్టర్, కాంపౌండర్, అటెండర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. మావిళ్లపాడు ఆస్పత్రిలో పశువైద్యాధికారి తప్ప మిగిలిన పోస్టులు ఏవీ భర్తీ కాలేదు. శ్రీధనమల్లిలోని పశువైద్య సబ్‌సెంటర్‌లో జూనియర్ వెటర్నరీ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. దీంతో పశువులతోపాటు మూగ జీవాలకు వైద్యం అందడం లేదు.

ఒకే వెటర్నరీ డాక్టర్ దిక్కు

దొరవారిసత్రం మండలంలో పశువైద్యుల గణాంకాల ప్రకారం 10,800 ఆవులు, 23,153 గేదెలు, 76,739 గొర్రెలు, 17,565 మేకలు, 42 పందులు, 69,300 కోళ్లు ఉన్నాయి. మావిళ్లపాడు పశువైద్య ఆస్పత్రికి చెందిన వెటర్నరీ డాక్టర్ దొరవారిసత్రం ఆస్పత్రికి కూడా ఇన్‌చార్జిగా వున్నారు. వారు ఎప్పుడు ఎక్కడ ఉంటారో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏహెచ్‌ఏలతో సేవలు

డాక్టర్లు, సిబ్బంది కొరత ఉండడంతో పశువైద్య ఆస్పత్రులతోపాటు గ్రామాల్లో వాక్సినేషన్, పశువైద్య శిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాలను గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహించే ఏహెచ్‌ఏలే చేపడుతున్నారు. ఏహెచ్‌ఏలు లేకపోతే గ్రామాల్లోని ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితరాలకు వైద్యం అందని ద్రాక్షే. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి పశువైద్య ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.



దొరవారిసత్రంలోని పశు వైద్యశాల, గత ప్రభుత్వం తీసుకువచ్చిన వైఎస్సార్ సంచార పశు వాహనం (ఫైల్)

డాక్టర్ ఎప్పుడు ఉంటారో తెలియడం లేదు


దొరవారిసత్రం పశువైద్యశాలలో వైద్యులు, సిబ్బంది ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి నెలకొంది. దీని వలన పశులకు సకాలంలో వైద్యం అందంలేదు. పశువులకు ఆరోగ్య విషయాల్లో సలహాల కోసం ఎప్పుడు వెళ్లినా ఆస్పత్రి మూసి వేసి ఉంటోంది.

– రాజశేఖర్, నెల్లూరుపల్లి

ఆస్పత్రుల వద్ద పడిగాపులు తప్పడం లేదు


మారుమూల ప్రాంతాల్లోని అన్ని గ్రామాలకు రైతులకు శ్రీధనమల్లి గ్రామంలోని పశువైద్యశాలే దిక్కు. స్థానికంగా ఉన్న పశువైద్యులు ఎప్పుడు ఉంటారో, ఎప్పుడు వస్తారో తెలియడంలేదు. పశువలను తీసుకుని ఆస్పత్రి వద్ద పడిగాపులు పడాల్సి వస్తోంది.

– రామయ్య, మీజూరు

అందుబాటులో ఉండేలా చూడాలి


డీవీ సత్రం, మావిళ్లపాడు ప్రాంతాల్లోని ఉన్న పశువైద్య ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బందిని నియమించి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రి వద్దే పశువులు, మూగజీవాలకు సకాలంలో వైద్యం అందేలా అధికారులు ఏర్పాట్లు చెయ్యాలి.

– సుబ్రమణ్యం, తనియాలి

పంచాయతీరాజ్‌లో సమస్యలపై వైఎస్సార్ సీపీ ఉద్యమ బాట


మాట్లాడుతున్న పాదర్తి రాధాక్రిష్టారెడ్డి

కోట : కూటమి ప్రభుత్వం పంచాయతీరాజ్‌లో అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించనున్నట్టు వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాక్రిష్టారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విద్యానగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లపై వైఎస్సార్ సీపీ మద్దతుదారులు అనే ముద్రవేసి తొలగించడం దారుణమన్నారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనాలు పెంచాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు వెంటనే విడుదల చేయాని, బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని తదితర డిమాండ్లతో 30వ తేదీన జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉప్పలప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతులకు అందుబాటులో యూరియా

చిట్టమూరు : ఎడగారులో వరి సాగు చేసే రైతులకు అవసరమైన యూరియా చిట్టమూరు పీఏసీఎస్‌లో అందుబాటులో ఉన్నట్టు ఏవో నిరంజన్‌కుమార్ తెలిపారు. కావలసిన రైతులు పట్టాదారు పాసుబుక్, 1బీ అడంగల్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి వేలిముద్ర వేసి యూరియా తీసుకోవాలని సూచించారు. బస్తా రూ.269లకు అందజేస్తున్నామని తెలిపారు. సోమవారం నుంచి రైతులకు యూరియా అందజేస్తామని తెలిపారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



చిల్లకూరు : సమాజంలో అశాంతిని రేకెత్తించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే పొరపాట్లు వల్ల స్టేషన్ రికార్డుల్లో రౌడీషీటర్లుగా నమోదు అవుతుంటారని తెలిపారు. దీనివల్ల కుటుంబ సభ్యులకు కూడా ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. గొడవలకు పోకుండా కష్టపడి పని చేసుకుని కుటుంబాలను పోషించుకోవాలని సూచించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు : తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కొంతమంది శరీరానికి వేప మండలు ధరించి ప్రదక్షిణ చేశారు. మహిళలు సంతానం కోసం ఆలయంలోని త్రిశూలం, రావి చెట్టు వద్ద వరపడ్డారు. ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం


మాట్లాడుతున్న వంకి పెంచలయ్య

గూడూరు రూరల్ : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసి 26 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రస్తుతం ఈ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీగా మారిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మెరిట్ విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం ఇంటర్‌లో 975 మార్కులు, 75 శాతం అంతకంటే ఎక్కువ వచ్చిన వారికి మేనేజ్‌మెంట్ కోటాలో ఉచితంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. తమ విద్యా సంస్థలో ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్, లీగల్ స్టడీస్, హోటల్ మేనేజ్‌మెంట్, డిజైన్ కోర్సులు, ఫార్మసీ ఉన్నాయన్నారు. సమావేశంలో ఏవో రామయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అకడమిక్ డీన్ రాజయ్య, అడ్మిషన్స్ ఇన్‌ఛార్జి కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ స్టవ్ నుంచి ఎగిసిపడిన మంటలు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని వెంకటగిరి రోడ్డు వరలక్ష్మి రైస్ మిల్లు సమీపంలోని ఒక ఇంటిలో ఆదివారం గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. ఇంటిలో ఉన్న షాకీర్ కుటుంబ సభ్యులు భయంతో పరుగులు తీశారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే స్థానికులు మంటలను ఆర్పివేశారు. అగ్నిమాపక సిబ్బంది పూర్తి స్థాయిలో మంటలను ఆర్పివేసి గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ


మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ అధికారులు

కోట : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ నావల్ యూనిట్ వార్షిక శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు క్యాంపు కమాండర్ లెఫ్టినెంట్ గణేష్ గొడంగవే బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఆరు జిల్లాల్లోని పలు కళాశాలల నుంచి 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారని తెలిపారు. వారికి సమాజంలో ప్రస్తుత పరిస్థితులపై అవగాహన కల్పించామన్నారు. ఒక్కో రోజు ఒక్కో విభాగంలో శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరానికి సంపూర్ణ సహకారం అందించిన కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిబిరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎన్‌వో మల్లికార్జునరెడ్డి, సీవీ నాగరాజు, పెంచలయ్య, నరేంద్రబాబు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి


నేదురుమల్లిని కలిసిన సదానందరెడ్డి

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయనను ఆదివారం వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన పుల్లూరు సదానందరెడ్డి, ఎంపీటీసీ పుల్లూరు శ్రీదేవి కలిశారు. పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, ములవాయిల వెంకటేశ్వర్లు, కొండూరు వెంకటరత్నంరాజు, సిద్ధవరం కుమార్, యాతలూరు సుబ్బరాయులు, గిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లిని కలిసిన నేతలు


సైదాపురం: నేదురుమల్లికి సమస్యలు వివరిస్తున్న సైదాపురం నేతలు

సైదాపురం: నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం సైదాపురం, రాపూరు మండలాలకు చెందిన నేతలు కలిశారు. నేతలు రవికుమార్‌యాదవ్, శ్రీనివాసులురాజు, నారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, చీర్ల బ్రదర్స్, గంగయ్య, చిరంజీవి, పొండయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి పరామర్శ


వెంకటగిరి రూరల్ : చిరంజీవులు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి రూరల్ మండలంలోని యాతలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత జంగాలపల్లి చిరంజీవులురెడ్డి ఈనెల 11న మృతి చెందారు. ఆదివారం ఉత్తరక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకుని చిరంజీవుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారుడు పాడురంగారెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా సన్నారెడ్డి జన్మదిన వేడుకలు


శ్రీనివాసులురెడ్డికి శుభాకాంక్షలు తెలపుతున్న నేతలు

చిట్టమూరు : వైఎస్సార్ సీపీ చిట్టమూరు మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఆ పార్టీ నాయకులు కృష్ణమనాయుడు కండ్రిగలో ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. శ్రీనివాసులురెడ్డిని శాలువాలు, పూల మాలతో సత్కరించారు. పలువురు నాయకులు ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మాచిరెడ్డి సుధీర్ రెడ్డి, తేరువాయి మణెయ్య, వైసీ పుట్టబాబు, చింతలమూడి మనోహర్, సంక్రాంతి కస్తూరయ్య, తిరునామల్లి కుమార్, భార్గవ్ పాల్గొన్నారు.

కండలేరులో 33.540 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 33.540 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,150, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

మీడియాపై దాడులు దారుణం


నిరసన తెలుపుతున్న మీడియా ప్రతినిధులు

చిల్లకూరు : ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మీడియాపై దాడులు పరిపాటిగా మారుతోందని, ఇది సరైంది కాదని గూడూరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తెలిపారు. తెలంగాణాలో ఒక చానల్ కార్యాలయంపై కొంతమంది దాడులు చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం గూడూరు టవర్ క్లాక్ ప్రాంతంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మీడియాపై దాడులు పెరగి పోతున్నాయని తెలిపారు. తద్వారా సమాజానికి తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.



పౌష్టికాహారం, దుస్తుల పంపిణీ


బాలింతలకు పౌష్టికాహారం, దుస్తులు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న బాలింతలు, చిన్నారులకు ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ ఆధ్వర్యంలో కొండూరు ప్రభాకర్‌రాజు, విజయమ్మ దాతృత్వంతో పౌష్టికాహారం, దుస్తులు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ఉండాలన్నారు. యువత సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.వి.రావు, సభ్యులు మురళీరాజు, గోపీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్, గురునాథం, స్వామి, రవీంద్రరెడ్డి, మురళీకృష్ణ, వెంకయ్య, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, విజయకుమార్, కావేరి తదితరులు పాల్గొన్నారు.



కడప రిమ్స్ ఆర్ఎంవోను కలిసిన కిలివేటి


ఆర్ఎంవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కిలివేటి

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ కడప రిమ్స్ వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ పెంచలయ్య– చిట్టెమ్మ దంపతులను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కలిశారు. పెంచలయ్య కుమార్తె డాక్టర్ హిమదీప్తి, డాక్టర్ జయదేవ్ వివాహం ఇటీవల బెంగళూరులో ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు కిలివేటి సంజీవయ్య ఆదివారం నాయుడుపేటలోని డాక్టర్ పెంచలయ్య స్వగృహానికి వచ్చారు. వారు ఇంటి వద్ద లేకపోవడంతో పెంచలయ్య దంపతులకు పుష్ప గుచ్ఛం అందజేశారు. ఆయన వెంట కలికి మాధవరెడ్డి, నిడిగింటి చిట్టిబాబు తదితరులు ఉన్నారు.

సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం


సమావేశంలో బలిజ సంక్షేమ సంఘం నేతలు

నాయుడుపేట టౌన్ : పేదలకు చేయూత ఇవ్వడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడమే బలిజ సంక్షేమ సంఘం లక్ష్యమని ఆ సంఘం సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షుడు పగడాల శివప్రదీప్ తెలిపారు. నాయుడుపేటలోని సంఘం కార్యాలయంలో ఆదివారం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల దుబాయ్‌లో మృతిచెందిన మదిరి మునిరత్నంకు సంతాపం తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బలిజ సంక్షేమ సంఘం సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షుడిగా ప్రదీప్ కుమార్, సహాయ కార్యాదర్శిగా హంసా పృథ్వీచంద్, ఉద్యోగ విభాగం నాయకులను ఎన్నుకున్నారు. బలిజ సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్యాప్స్ ర్యాంక్స్ సంస్థ నిర్వహిస్తున్న విద్య, వైద్యం, రక్తదానం తదితర కార్యక్రమాలపై తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ హేమకుమార్ వివరించారు. హంసా రామారావు, గడదాసు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, నీలం హరికృష్ణ, కొప్పులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

వెంకటగిరి రూరల్ : మండలంలోని మన్నేగుంట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన స్తున్న ఉపాధ్యాయురాలు బి.లలితను ఆదివారం తోటి ఉపాధ్యాయులు అప్పిన వెంకటేశ్వర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. ఆమె బదిలీని తట్టుకోలేక విద్యార్థులు కంటతడి పెట్టారు.


లలితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



గ్రామంలోకి రొయ్యల చెరువుల నీరు


రొయ్యల చెరువుల వద్ద నిరసన తెలుపుతున్న పిట్టివానిపల్లి గ్రామస్తులు

చిట్టమూరు : రొయ్యల చెరువుల నుంచి కలుషిత నీటిని తమ గ్రామంలోకి వదులుతున్నారని పిట్టివానిపల్లి వాసులు వాపోయారు. వారు ఆదివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మల్లాం గ్రామానికి చెందిన ఓ భూస్వామి పిట్టివానిపల్లిలో సుమారు 50 ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నాడని తెలిపారు. 12 ఎకరాలకు మాత్రమే మత్స్యశాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నాడని వెల్లడించారు. రొయ్యల చెరువుల్లోని కలుషిత నీటిని గ్రామంలోకి, వరి పొలాల్లోకి వదులుతున్నాడని ఆరోపించారు. దీంతో పంటలు సక్రమంగా పండక అప్పులపాలవుతున్నామని తెలిపారు. విష రసాయనాలు కలిసిన నీరు తాగి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పిట్టివాని పల్లి గ్రామస్తులు తెలిపారు.

అక్రమ మైనింగ్‌దారులకే అధికారుల మద్దతు

చిల్లకూరు : సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ చేస్తున్న వారికే అధికారులు మద్దతు ఇస్తున్నారని నెల్లూరు జిల్లా ఏఐఎంకేఎస్ అధ్యక్షుడు డీపీ పోలయ్య ఆరోపించారు. ఆయన ఆదివారం గూడూరులోని విశ్రాంత ఉద్యోగులు భవనంలో విలేకరులతో మాట్లాడారు. సైదాపురం మండలంలో పలుచోట్ల అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. దీంతో భూములు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని తెలిపారు. అలాంటి భూములు సుమారు 400 ఎకరాలు ఊటుకూరు గ్రామంలో వున్నాయని తెలిపారు. వాటిలో 200 ఎకరాలకు పైగా పెత్తందారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. 50 ఎకరాలను 50 మంది దళితులు సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకుంటుండగా మైనింగ్ యాజమాన్యం పోలీసుల ద్వారా అక్రమ కేసులు బనాయించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. తప్పుడు కేసులు, ఇతర సమస్యలపై సోమవారం సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రమేష్, మమత తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్

గూడూరు రూరల్ : నేరాలను నియంత్రించేందుకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం ఉదయం తమ సిబ్బందితో కలిసి గూడూరు రూరల్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 4 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నేర రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.

